Ananth & Ananth Series



# సూర్యదేవర రామ్ మోహన రావు

**THE NUMBER ONE BEST SELLING AUTHOR**



ఒక

# సరికొత్త ప్రేమకథ

# ఒక సరికొత్త ప్రేమ కథ

ప్రేమ, ద్వేషం రెండూ రెండు విభిన్న ధృవాలు...

ఒక్కొక్కప్పుడు ప్రేమ విషయంలో కొంతమంది రాజీ పడతారు. రాజీ లేనిది, విషంలాంటి ద్వేషమే. ద్వేషం అడవి నాగుబాము కుబుసం లాంటిది. ప్రతిరోజూ అందంగా పురులువిప్పే నెమలి ఫింఛం ప్రేమకు నిదర్శనమైతే ప్రతి ఊపిరిలోనూ ద్వేషాన్ని వెలిగ్రక్కే ఆధునిక మృగమే మనిషి!

*          *          *          *          *

"ఇదిగో మయూషా, ఆ కరివేపాకు రెమ్మలు ఏం తెచ్చావే తల్లీ, అదేదో నీ ఆస్తి పోతుదన్నట్టు రెండంటే రెండు రెమ్మలు తెచ్చావేంటి పిల్లా–చారులోకి రెండు రెమ్మలు విరుచుకురా తల్లీ" వంటగదిలోంచి వదిన మాలతి పిలుపువిని డ్రెస్సింగ్ టేబుల్‌ముందు బొట్టు పెట్టుకుంటున్న మయూష తలతిప్పి కిచెన్‌రూమ్ వేపు ఓరగా చూసింది.

"ఉదయం లేచిన దగ్గిర్నించీ, బాత్‌రూమ్‌లో గంట, డాబామీద అరగంట, అద్దం ముందు రెండు గంటలు తప్ప ఇంటి పనిమీద దానికి ధ్యాసేమైనా వుందా మాలతీ–నే వెళతానుండు" బియ్యం ఏరుతున్న మయూష తల్లి చేట ముందునుంచి ఆయాసంతో లేవబోయింది.

గబుక్కున లోన రూమ్‌లోంచి పరుగు పరుగున బయటికొచ్చింది మయూష. వరండా మీద నిలబడి తల్లివేపు చుర చుర లాడుతూ చూసింది.

"కరివేపాకు రెమ్మల్ని తగు మాత్రమే వంటల్లో వాడాలి తప్ప గోంగూర కట్టల్లా వేయకూడదు. అందుకే రెండంటే రెండు రెమ్మల్ని తెచ్చాను. కావాలంటే తెస్తానుగా. ఎందుకలా నస" వదినతో చనువుగా నవ్వుతూ అనేసి పెరటి మెట్టు మీద కాలేసింది మయూషా.

"ఆ వంటల పుస్తకం చదివి వంటలు నేర్చుకోమని అనడం నాదీ తప్పు. ఆ పుస్తకాల్లో రాసినట్టుగా తగుమాత్రం కరివేపాకు, రెండు చెంచాల ఉప్పు, ఈ పద్ధతిలో వంట చేసావనుకో – నీ కొస్తాడే ఆ మొగుడు రెండ్రోజుల్లో బైరాగుల్లో కలిసిపోవడం ఖాయం" వదిన మాలతి నవ్వుతూ అంది.

"ఆ వచ్చే మొగుడికి వంట చేయడంకోసం నేను పెళ్ళి చేసుకోవాలా– చచ్చినా పెళ్ళి చేసుకోను" మొగుడు అనే పదం వినబడగానే ఎందుకో మయూష కళ్ళల్లో ఆనందం, బుగ్గలమీద అంచక్కటి నీరెండ లాంటి వయసు వెలుగు తొంగి చూసింది.

ముచ్చటగా సిగ్గుపడింది మయూష!

ఇరవై రెండేళ్ళ మయూష సన్నగా పొడవుగా వుంటుంది. అటు నలుపూ, ఇటు తెలుపూ కాని దేహఛాయ. కోలగా పొడవాటి ముఖం విశాలమైన నుదురు కింద నల్ల కలువల్లాంటి కళ్ళు–చిన్ని పెదాలు–జలపాతం లాంటి జుత్తు– ఈ ఏడాదితో డిగ్రీ ఫైనలియర్ పూర్తవుతుంది.

పెరట్లోకి అడుగుపెట్టిన మయూష గోడవరకూ వెళ్ళి ఆగింది.

పాతకాలపు యింటి పెరడు కావడంవల్ల విశాలంగా వుంది. ఎత్తుగా పెరిగిన కొబ్బరిచెట్లు, ఆ పక్కన గుబురుగా చింతచెట్లు, ఆ పక్కన మామిడిచెట్లు, ఆ మామిడి చెట్టుకి ఆనుకుని వరసగా కూరగాయల మొక్కలు, ఆ పక్కన దానిమ్మ, దాని పక్కన కరివేపాకు చెట్లు.

ప్రతిరోజూ లేవగానే తోటలోను, డాబామీద కాసేపు తిరగడం మయూషకు అలవాటు. ఆమె ఇంటికి ఎడమపక్కన చిన్న పెంకుటిల్లు వుంది. డాబామీంచి ఆ యిల్లు చెట్లమధ్యనుంచి కుటీరంలా కనబడుతుంది.

మొన్నటివరకూ ఆ యిల్లు ఖాళీగానే వుంది. రెండ్రోజులక్రితం ఆ ఇంట్లో కొత్తగా ఎవరో దిగారు.

క్రితంరోజు ఉదయం సరిగ్గా ఎనిమిది గంటలకు బాడామీద కెక్కి అలవోకగా పక్కింటి పెరడువైపు చూసిన మయూషకు ఒక అనుకోని దృశ్యం కనబడింది–అలాంటి దృశ్యాన్ని చూడడం ఆమెకు అదే ప్రథమం – ఏదో తెలియని ఉత్సాహంతో గోడ చివరవరకూ వెళ్ళి చింతచెట్టు కొమ్మల వెనుకనుంచి రహస్యంగా చూసింది, ఆ దృశ్యాన్ని.

పాతికేళ్ళ యువతి బకెట్‌తో నీళ్ళు తెచ్చుకుని బాత్‌రూమ్‌లో పెట్టి టవల్‌ని గోడమీద పెట్టి బాత్‌రూమ్‌లోకి అడుగు పెట్టేలోపలే–

ముప్పై ఏళ్ళ వ్యక్తి గబగబా లోన్నుంచి లుంగీతో పరుగెత్తుకొని వచ్చి అటూ యిటూ దొంగచూపులు చూసి చటుక్కున మెరుపు వేగంతో ఆ యువతిని గోడచాటుకి లాగి తన రెండు చేతుల్లో గాఢంగా బంధించి ఆమె ఏదో మాట్లాడ బోయేంతలో, తన రెండు పెదవుల్తో ఆమెకు కొన్ని క్షణాలసేపు మాట్లాడనివ్వకుండా చేసి ముద్దుపెట్టేసుకుని ఆ పనయిన తర్వాత–

నవ్వుతూ ఆమెవేపు చూసి, ఆమె బుగ్గమీద చిటికెన వేలితో చిన్నగా కొట్టి, వేగంగా లోనికి వెళ్ళిపోయాడు.

ఆదరా, బాదరాగా వెళ్ళిపోతున్న అతనివేపు ఆమె ఒక్కక్షణం చిరుకోపంగా చూసి, అంతలోనే అందమైన నవ్వుని పెదవులమీద పూసుకుని పమిటలో ఇరుక్కు పోయిన మంగళసూత్రాన్ని సర్దుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయిందామె.

మాటలులేని ముచ్చటయిన దృశ్యం. ఒక అద్భుతమైన నిశ్శబ్ద దృశ్యం–

ఆ గోడచాటు ముద్దు దృశ్యం ఆ వివాహిత యువతి మనసులో ఎలాంటి భావ సంచలనాన్ని కలిగించిందో తెలీదుగాని, పెళ్ళి కాని మయూష వంటినిండా చిరుచెమటలు పట్టేసాయి. ఎవరో తననే అదృశ్యంగా ముద్దు పెట్టుకున్నట్టుగా అయిపోయిందామె.

కాసేపు తనెక్కడున్నదో మరిచిపోయింది ఆమె.

చాలా సినిమాల్లో ముద్దు దృశ్యాలను చూసినా, ఎప్పుడూ ఎన్నడూ కలగని సంచలనం మనసంతా సముద్రపు ఒడ్డులా అయిపోయింది.

బస్సులో వెళుతున్నప్పుడు కాలేజీలో కుర్రాళ్ళ మధ్యనుంచి నడుస్తున్నప్పుడు, ఏదో రకంగా అమ్మాయిల్ని టచ్ చెయ్యాలని అబ్బాయిలు ఎందుకు ప్రయత్నిస్తారో, చాలా కాలం మయూషకు అర్థం అయ్యేది కాదు.

పక్కింటి పెళ్ళయిన భర్త తన భార్యను అంత రహస్యంగా ఎందుకు ముద్దుపెట్టుకున్నాడు? అంత దొంగచాటుగా ముద్దుపెట్టుకోవాల్సిన అగత్యం వాళ్ళకేముంది? భార్యాభర్తల మధ్య జరిగే సహజమైన చర్య అది. దానికెందుకంత భగీరథ ప్రయత్నం...? అది తప్పు కాదే?!

రహస్య ప్రేమలో అంతటి తీయదనం వుంటుందా? థ్రిల్ వుంటుందా? ఎందుకో ఆ ముచ్చటైన ముద్దు దృశ్యం చాలా నచ్చింది ఆమెకు.

క్రితం రోజంతా ఆ దృశ్యమే ఆమెను వెంటాడింది.

బస్సు సీట్లో కూర్చున్నప్పుడు, కాలేజీలో లెక్చరర్ లెసన్ చెపుతున్నప్పుడు, క్యాంటీన్‌లో ఫ్రెండ్స్ మధ్య జోక్స్ కట్ చేస్తున్నప్పుడు, మధ్యాహ్నం ఒంటరిగా బస్టాపులో నిలబడినప్పుడు-

గోడచాటు ముద్దు!

గోడచాటు ముద్దు!!

అందుకే రాత్రి చాలాసేపు ఆమెకు నిద్రపట్టలేదు.

కలలాంటి, నిజంలాంటి, భ్రమలాంటి, అసత్యంలాంటి అర్థ స్వప్నాల్లాంటి ఆలోచనలు...

అందుకే ఉదయాన్నే తొందరగా లేచి కరివేపాకు కోయాలనే మిషతో చాలాసేపు పెరట్లో తిరుగింది.

బాత్‌రూమ్‌వేపు చూసింది.

ఆ బాత్‌రూమ్ గోడ అక్కడకు చాలా దగ్గర. మయూషకు అటుపక్క జరిగేది చక్కగా కనిపిస్తుంది తప్ప అవతలివాళ్ళకు ఇటువేపు గుబురు కొమ్మలు తప్ప మరేమీ కనిపించవు.

ఆ రోజు కూడా అలాంటి దృశ్యాన్ని చూడాలని వుంది మయూషకు. రహస్యంగా జరిగే ఆ ముద్దు ప్రక్రియ వెనక దాగిన ఆనందం గురించి తెలుసుకోవాలని వుందామెకు. కానీ ఉదయం ఆమెకు వాళ్ళిద్దరూ కన్పించలేదు.

ఒకవేపు కరివేపాకు రెమ్మల్ని కోస్తూనే వున్నా రెండోవేపు ఆమె చూపులు, చెవులు పక్కింటివేపే వున్నాయి.

సరిగ్గా అదే సమయంలో–

విన్పించిందో శబ్దం!

బకెట్‌లో నీళ్ళు తోడుతున్న నీళ్ళ చప్పుడు...

అంతే ఉత్సాహం పొంగిపోయిన మనసులో దానిమ్మచెట్టు పక్కనున్న గట్టెక్కి పక్కింటి పెరట్లోకి చూసింది.

నిన్న చూసిన యువతే బకెట్‌నిండా నీళ్ళను తోడి బకెట్ పట్టుకుని బాత్‌రూమ్‌వేపు నడుస్తోంది.

నిన్నటిలాగే అతనిప్పుడు వస్తాడా? వచ్చి ముద్దు పెట్టుకుంటాడా నిన్నటిలాగా ఆమె అతడ్ని వారించలేదా? ఏమిటా ముద్దు రహస్యం!

రెండు మనసులు చెప్పుకోలేని కనురెప్పల మూగ భాషమో ముద్దు.

రెండు హృదయాల అంతరాత్మల్లోని మధురాకృతుల అక్షర ఘోషకి ముద్దు.

ముద్దుకు ముచ్చటైన శబ్దాలే తప్ప లిపి లేదు.

లిప్త కాలపు బావలయ పేరే ముద్దు.

ఎక్కడో కవిత్వం పుస్తకంలో చదివిన వాక్యాలు జ్ఞాపకాని కొచ్చాయి మయూషకు.

దాంతో మరింతగా రిక్కించి చూస్తోందామె.

పక్కింటి యువతి బాత్‌రూమ్‌లోకి అడుగుపెట్టే క్షణంలో–

పరుగు పరుగున వచ్చాడతను.

ఆమె చెయ్యి పట్టుకుని పక్కకు లాగాడు. ఆ విసురుకి బాత్‌రూమ్ వెనక గోడకు చేరబడిపోయిందామె. ఆమె ఎదురుగా ఎగిసిపడుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసల్తో అతను! రెండే రెండు క్షణాలు. మయూష ఆ దృశ్యాన్ని చూస్తూ ఊపిరి బిగపట్టింది.

"ఉష్...ష్...ష్...." ఇష్టాఇష్టాల మధ్య ఆమె ఊగిసలాడుతోంది.

"నువ్వు సరిగ్గా ఇక్కడే ఈ స్పాట్‌లోనే చక్కగా నాకు దొరికిపోతావని నాకు తెలుసు" గర్వంగా అల్లరిగా అన్నాడతను.

"బాగానే వుంది సంబడం. అత్తగారు చూస్తే? మీకేం మగ మహారాజులు, నా పరువు పోతుంది. అయినా శ్రావణమాసం మనిద్దరం కలవగూడదని" ఆమె గుసగుసలాడుతోది ఓపక్క సిగ్గుపడుతూనే.

సరిగ్గా అదే సమయంలో ఆమెను మరోసారి అతను ముద్దుపెట్టుకున్నాడు.

"మొండి... అయినా... యింకా పదిహేను రోజు...లే... గ...దా...." ఆమె అన్నది.

"పదిహేనురోజులే గదా... అలా సాగదీసుకుని పెద్ద ఆరిందాలా చెప్పకు. అయినా ఈ శ్రావణమాసాల్ని, ఆషాడమాసాల్ని కేలండర్‌లోంచి బాన్‌చేస్తేగానీ, మనలాంటివాళ్ళకు మనశ్శాంతి వుండదు. రాత్రిళ్ళు, అత్తగారి పక్కన అలా మొద్దుగా పడుకోవడమేనా, నేను చేసే సంజ్ఞలేవీ నీకు విన్పించవా?" చిరుకోపంగా అడిగాడతను.

"విన్పిస్తాయి. ఎందుకు విన్పించవూ. ఏం నన్నొదిలి వుండలేరా– ఆఫీసులో ఎలా వుంటున్నారు?" సిగ్గుపడుతూ నెమ్మదిగా అడిగిందామె.

"కమ్...టు...ది...పాయింట్. ఇవాళ రాత్రి సరిగ్గా పదిగంటలకు, అలారమ్ పెడతాను. అలారమ్ మోగిందంటే అర్థం. నేను నిన్ను పిలుస్తున్నానని అర్థమైందా?"

"బాగుంది. నేనేం రౌడీ పిల్లననుకొన్నారా? నే్రాను. అత్తగారికి తెలిస్తే" అమాయకంగా అంది ఆ అమ్మాయి.

"తెలిస్తే ఏమవుతుందట?" అసహనంగా అన్నాడతను.

అప్పుడే లోపల్నుంచి పిలుపు వినబడేసరికి ఆ యువతి తుళ్ళిపడింది.

"మీ కోసం ఎవరో వచ్చారట. మీ అమ్మగారు పిలుస్తున్నారు" వేళాకోళంగా నవ్విందామె.

"అందరూ ఇప్పుడే తగలబడతారు. నువ్వు రాత్రికి వస్తావు అంతే" డిమాండింగ్‌గా అనేసి కంగారుగా ఆమెను వదిలేసి పరుగు పరుగున వెళ్ళిపోతున్న భర్తవేపు సంతోషంగా, సంతృప్తిగా చూసి బాత్‌రూమ్‌లోకెళ్ళిపోయిందామె.

వాళ్ళ మాటల్ని, చేష్టల్ని చాలా దగ్గరగా రహస్యంగా చూసిన మయూష మాటలురాని బొమ్మలా నిలబడిపోయింది.

వళ్ళంతా అచేతనంగా అయిపోయింది. ఆమెలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఎగిసెగిసి పడుతున్నాయి.

ఒక్క క్షణం ఆలోచించిందామె.

తనని కూడా తన భర్త యిలా గోడచాటున అందంగా ముద్దు పెట్టు కుంటాడా? ఈ ఆలోచన మయూషకు చెప్పలేనంత హుషారు నిచ్చింది.

అంతట్లోనే లోన్నించి తల్లి పిలుపు వినబడేసరికి గట్టుమీదనుంచి కిందకు దూకి కిచెన్ రూమ్‌లోకి పరుగు పెట్టింది మయూష.

"రెండు రెమ్మలు తేవడానికి ఇంతసేపటే?" తల్లి చోద్యంగా చూస్తూ అడిగి, పక్కగదిలోకెళ్ళిపోయింది.

వదిన మాలతి మాత్రం ఎగాదిగా మయూష వేపు చూసి–

"అవునుగానీ మరదలు పిల్లా ఆ ముఖమ్మీద చెమట, ఆ తొట్రుపాటు ఏవిటిదంతా– మొగుడితో రహస్యంగా సంసారం చేసినట్టు...." నవ్వుతూ కొంటెగా కన్ను గీటుతూ అందామె.

"ఛీ... పో వదినా, నువ్వెప్పుడూ ఇంతే. అయినా మీ తమ్ముడు ఇక్కడ లేడుగా?" జవాబు చెప్పేసి తన రూమ్‌లోకెళ్ళి పుస్తకాలందుకొని కిచెన్ రూమ్ దగ్గరకొచ్చి నిలబడింది మయూష.

"మా తమ్ముడుంటే పెళ్ళి కాకుండా సంసారం చేసేద్దామనా?" ఏదో అల్లరిగా అనబోయిన మాలతి అప్పుడే వరండాలోకి అడుగుపెట్టిన మావగారిని చూసి మాటల్ని మింగేసింది భయంతో.

"నువ్వు నాతో కాలేజీకి వస్తావా? సిటీ బస్సులో వెళతావా...?" అడిగాడు మయూష తండ్రి పీతాంబరరావు.

"అదే ఆలోచిస్తున్నాను" అని తండ్రికి జవాబు చెప్పి "వదినా నీ ప్రశ్నకు ఈవెనింగు ఆన్సర్ చెప్తా" అని చెప్పి–

"నాన్నా నేను సిటీ బస్సులో కాలేజీకెల్తా. నువ్వెళ్ళిపో" అంది మయూష.

"అయితే నిన్ను బస్టాప్‌లో డ్రాప్ చేస్తాన్రా" ఆ మాట అంటూ ఆయన మొదటి గదిలోకొచ్చి ఏవో ఫైల్స్ తీసుకుని స్కూటర్‌ని స్టార్ట్ చేశాడు.

వెనుక సీట్లో మయూష కూర్చుంది. స్కూటర్ కొన్ని క్షణాల తర్వాత ముందుకు పరిగెత్తింది.

*   *   *   *   *

బర్కత్‌పురా బస్టాప్‌లో మయూషను డ్రాప్ చేసేసి, తను నారాయణగూడ వేపు వెళ్ళిపోయాడు పీతాంబరరావు.

ఉదయం తొమ్మిదీ ఇరవై అయిదు నిమిషాలు.

కాలేజీలకు ఆఫీసులకు వెళ్ళే జనాలతో బస్టాపు కళకళ్ళాడిపోతోంది.

రోడ్‌ని క్రాస్‌చేసి యూనివర్శిటీవేపు వెళ్ళే బస్టాపులో నిలబడింది మయూష.

అయిదు నిమిషాల తర్వాత వచ్చిన బస్సెక్కి కూర్చుంది. బస్ శంకరమఠ్ మీదుగా వెళుతోంది.

కిటికీలోంచి రోడ్డుమీద కన్పిస్తున్న దృశ్యాల్ని చూస్తోందామె.

సరిగ్గా అదే సమయంలో-

యూనివర్శిటీ బ్రిడ్జి దగ్గర స్లో అయింది. అప్పుడే ఆమె చూపులు అకస్మాత్తుగా వంతెన కింద రైలుపట్టాల పక్కనున్న యిళ్ళమీద పడ్డాయి.

అన్నీ చిన్న చిన్న గుడిసెలు- ఒక గుడిసె ముందర రిక్షా- రిక్షా నడిపే వ్యక్తి దగ్గరికి గుడిసెలోంచి వచ్చిన ఒక యువతి ఏదో వస్తువును చేతిలో పెట్టింది. అదే సమయంలో ఆ వ్యక్తి అటూ ఇటూ చూసి గబుక్కున ఆమె బుగ్గల్ని చేత్తో పట్టుకుని గిల్లాడు.

ఆమె ఉత్తుత్తి కోపాన్ని నటిస్తూ చేయి విసిరికొట్టి దూరంగా జరిగింది. అతనేదో నవ్వుతూ చెప్తూ రిక్షాను ముందుకు లాగాడు.

ఆ దృశ్యం చాలా ముచ్చటగా వుంది మయూషకు.

ఆ గుడిసెముందు వాళ్ళిద్దరే వున్నారు. కాని వంతెన పైనుంచి తను వాళ్ళద్దర్నీ చూస్తున్నట్లు తెలీదు.

బహిరంగ దొంగ సరసం!

అతను ఆమె భర్తే! ఆమె అతని భార్యే అయ్యుంటుందా, ఏమిటా దొంగ సరసంలోని తియ్యదనం! గుడిసెలోకెళ్ళి ఆ పని చెయ్యొచ్చుగా? సభ్యసమాజం అంగీకరించే ఆ ముద్దుని అంత ఆదరాబాదరాగా, అదీ దొంగ చాటుగా పెట్టుకోవాల్సిన అవసరం ఏమిటి? అంత అగత్యం ఏముంది? ఎంత ఆలోచించినా మయూషకేమీ అర్ధంకాలేదు.

బస్సు ముందుకు వెళ్ళిపోతున్నా, తలతిప్పి వెనక్కి చూస్తూనే వుంది మయూష.

"టిక్కెట్ ప్లీజ్" కండక్టర్ పిలుపుకి తలతిప్పి చూసిందామె- తేరుకొని పర్సులోంచి రూపాయి కాయిన్‌ని తీసి ఇచ్చింది.

టికెట్‌ను ఆమెకిస్తూ నవ్వాడతను.

ఆ నవ్వులో కొంటెతనం వుంది. ఆర్ట్స్ కాలేజీ జంక్షన్లో, బస్సులోంచి దిగుతున్నప్పుడు మయూష కళ్ళవేపు చూసి చిలిపిగా నవ్వాడు ఆ కండక్టర్- అలా ఎందుకు నవ్వాడో అర్ధంగాక విస్తుపోతూ బస్సు దిగింది.

ఈ మగవాళ్ళతో ఇంతే- ఆసక్తిగా చూస్తే ఏదో పెద్ద ఇదైపోతారని అనుకుంటూ రోడ్డుదిగి కాలేజీవేపు అడుగులేస్తున్న మయూష-

ఏదో పిలుపు వినబడటంతో ఆగిపోయి పక్కకు తిరిగి చూసింది. క్లాస్‌మేట్ రాజేశ్వరి!

"మయూషా! నీ కోసమే ఎదురుచూస్తున్నాను. మన భార్గవిని నర్సింగ్ హోమ్‌లో జాయిన్ చేసార్ట. సిట్యుయేషన్ చాలా క్రిటికల్‌గా వుందట. నీకోసం రెండుసార్లు అడిగిందట భార్గవి. హాస్టల్ వార్డెన్‌కి మీ ఇల్లు తెలియదు. నువ్వు కలిస్తే నిన్ను తీసుకుని నర్సింగ్‌హోమ్‌కి అర్జంటుగా రమ్మని చెప్పి, పది నిమిషాల క్రితం వార్డెన్ వెళ్ళింది...." గబగబా చెప్పింది వగరుస్తూ రాజేశ్వరి.

"భార్గవికి ఏమైంది?" తడారిపోయిన గొంతుతో ప్రశ్నించింది మయూష.

"తర్వాత ప్రశ్నలు. ముందు నర్సింగ్ హోమ్‌కి వెళ్దాం పద" రోడ్డుపక్కన ఆగిన ఆటోవేపు పరుగెత్తుతూ అంది రాజేశ్వరి.

ఆమె వెనక కంగారు కంగారుగా ఆటో ఎక్కింది మయూష. ఆమె కంతా అయోమయంగా వుంది.

*  *  *  *  *

విద్యానగర్‌లోని అర్చనా నర్సింగ్‌హోమ్...

రెండో ఫ్లోర్లో వున్న ఆ రూమ్‌లోకి అడుగుపెట్టిన మయూష అదురుతున్న గుండెలతో బెడ్‌మీద దాదాపుగా కొన ఊపిరితో పడున్న భార్గవిని చూడగానే గుండాగినంత పనయింది.

"భా...ర్గ...వీ" గుండెల వరకూ కప్పిన బెడ్‌షీట్‌లో పాలిపోయిన భార్గవి ముఖంలోకి కన్నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది మయూష.

"మీరేనా మయూష" పక్కన వున్న డాక్టర్ చటుక్కున తలతిప్పి మయూష వేపు చూసింది.

"వన్ మినిట్. ఇలా రండి" హడావుడిగా పక్క రూమ్‌లోకి నడిచింది ఆ లేడీ డాక్టర్.

ఆమెను అనుసరించింది మయూష పాలిపోయిన మోముతో.

"భార్గవి నాకు చాలా కాలంగా తెల్సు... అందుకే... పోలీసుల కింకా ఫోన్ చెయ్యలేదు" నుదుటిమీద చెమటను తుడుచుకుంటూ అంది లేడీ డాక్టర్.

"ఇంతకీ...." మయూష నోట్లోంచి ఇంకా ప్రశ్న రాలేదు– మళ్ళీ చెప్పడం ప్రారంభించింది లేడీ డాక్టర్.

"ఏమైందో తెలీదు. తెల్లవారుజామున లేచి వంటిమీద కిరోసిన్ పోసుకుని కాల్చుకుంది. వళ్ళంతా కాలిపోయింది. బతుకుతుందో లేదో చెప్పలేను. ఉన్న ఒక్కగానొక్క తల్లికీ ఏం తెలియదు. ఇప్పటికి రెండు సార్లు స్పృహలోకి వచ్చింది. అడిగాను. ఏం చెప్పలేదు. రెండుసార్లూ నీ పేరే చెప్పింది" బాధగా అంది డాక్టర్.

"ఎందుకిలా చేసింది?" ప్రశ్నించింది మయూష షాక్ నుంచి మెల్లగా తేరుకుంది.

"అది మీరు కనుక్కోవాల్సిన విషయం. మరో పావుగంటలో ఆమెకు పూర్తిగా స్పృహ రావచ్చు, అసలేం జరిగిందో కనుక్కోండి. ఈ లోపల ఉస్మానియా

నుంచి స్పెషలిస్టుల్ని రప్పించడానికి ప్రయత్నిస్తాను. ఎందుకయినా మంచిది. పోలీసులకు ఫోన్ చేస్తాను" అంటూ రూమ్‌లోంచి బయటకు వెళ్ళింది లేడీ డాక్టర్.

మరో పావుగంట తర్వాత–

కళ్ళిప్పి చూసిన భార్గవి ఎదురుగ ఆప్త మిత్రురాలు మయూష కనబడగానే వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది.

"భార్గవీ... అసలేమిటిదంతా... నిన్న మధ్యాహ్నం వరకూ బాగానే వున్నావే?" దుఃఖభాజకమైన ఆ సంఘటనను వాస్తవంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తూ అడిగింది మయూష.

అటూ ఇటూ చూసి తలుపులోన గడియ పెట్టమన్నట్టుగా సంజ్ఞ చేసింది భార్గవి.

"చెప్పు ఏం జరిగింది?" కన్నీళ్ళను తుడుచుకుంటూ అడిగింది మయూష.

భారంగా, బాధతో నిట్టూర్పు విడిచి చెప్పడం ప్రారంభించింది భార్గవి.

"మయుషా... ఈ క్షణం నా జీవితంలో వస్తుందని నేనూహించలేదు. ఈ ప్రపంచంలో సిన్సియర్ ఫ్రెండ్‌గా నన్ను నువ్వు నమ్మినప్పటికీ నేను నీకు సిన్సియర్ ఫ్రెండును కాను. ఎందుకో తెలుసా...?

నా జీవితానికి సంబంధించిన చాలా రహస్యాలు ఎప్పటికప్పుడు నీకు తెలియకుండా జాగ్రత్త పడ్డాను. అందుకే నిన్న రాత్రి నేను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు నీకు రెండు పేజీల ఉత్తరం రాసాను.

నేను ఇంకా ఎన్ని నిముషాలో బతకను. కానీ... నేను చనిపోతూ నిన్నొక కోరిక కోరుతున్నాను తీరుస్తావా?" గాజు కళ్ళను కదిలిస్తూ అర్థిస్తున్నట్టుగా అడిగింది భార్గవి.

అదంతా అయోమయంగా, అనూహ్యంగా వుంది మయూషకు.

మయూష అప్రయత్నంగా తన చేతిని భార్గవి చేతిలో పెట్టింది అభయం యిస్తున్నట్టుగా.

"చెప్పు నీ కోరికేమిటో" అనునయంగా అడిగింది మయూష.

"మయూషా... నేనెప్పుడూ సీరియస్‌గా నీకే విషయమూ చెప్పలేదు కదూ... కానీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి... ఎందుకో తెలుసా... నేను మోసపోయాను-దారుణంగా మోసపోయాను గనుక-

ఇదే హైద్రాబాద్‌లో కోటీశ్వరుడయిన ఒక వ్యక్తి నమ్మించిన నమ్మకానికి, నేను దారుణంగా బలైపోయాను. నేను మొదట ఎంచుకున్న మార్గం తప్పే... ఆ తప్పులోంచి బయటకు రావటానికి ప్రయత్నించి... నిప్పులపాలయ్యాను... అవును మయూషా.... నిజం నిప్పులాంటిది కదా... ఆ నిప్పులో నేనే కాలిపోయాను...

భార్గవి కాలిన చెంపల మీదనుంచి కన్నీటి చుక్కలు నెమ్మదిగా జారుతున్నాయి ఆమెలో కరుడుగట్టుకుపోయిన బాధని కరిగిస్తూ-

"కానీ ఈ నా పరిస్థితికి కారణం...." తలగడ పక్కనున్న హేండ్‌బ్యాగ్‌ను అందుకుని నెమ్మదిగా జిప్ తీసి అందులోంచి ఒక కవర్ని తీసి మయూష చేతిలో పెట్టింది భార్గవి.

" ఈ ఉత్తరం చదువు మయూషా! నేను దారుణమైన మోసానికి, అన్యాయానికి గురయ్యానని నీ కనిపిస్తే నాకు న్యాయం చెయ్యి. మనిషి చచ్చి పోయాక ఉన్నవాళ్ళు కోరికలు తీరిస్తే చనిపోయినాకా, ఆత్మ సంతృప్తి చెందు తుందని అంటారు. కానీ నాకా నమ్మకం లేదు.

నేనుచచ్చిపోయాక ఎప్పుడయినా నన్ను తల్చుకుంటానని చెప్పు, చాలు హాయిగా...." అంటూ బాధగా పక్కకు తిరిగింది భార్గవి.

"అంత మాటనకు భార్గవీ, నీ కోసం నేను నిలబడతాను. నీకు జరిగిన అన్యాయానికి ఎదురు తిరిగి, మన ఫ్రెండ్స్ అందరి సహాయంతో న్యాయం కోసం నేను పోరాడుతాను. నువ్వేం బాధపడకు. చచ్చిపోతానని పిరికిదానిలా ఆలోచించకు. జరిగినదేదో జరిగిపోయింది...." అంటూ చేతిలోని కవర్ని విప్పబోతూ భార్గవి ముఖంలోకి చూసి కెవ్వుమని కేకలేసింది మయూష.

అకస్మాత్తుగా అప్పుడే పక్కకు తల వాల్చేసిన భార్గవి ముఖం వికృతంగా కన్పిస్తోంది-

పరుగు పరుగున వచ్చిన లేడీ డాక్టర్ భార్గవిని టెస్ట్ చేసి "సారీ మయూష. షి ఈజ్ నో మోర్...." అందా డాక్టర్ బాధగా.

రెండు నిమిషాలసేపు అలా భార్గవి తెరచివున్న కళ్ళవేపే చూసింది మయూష.

ఎప్పుడూతన కుటుంబ - పరిస్థితుల గురించి కానీ, తన గురించి కానీ చెప్పుకోకుండా ఉల్లాసంగా, ఆనందంగా మాత్రమే వుండడానికి, కన్పించడానికి ప్రయత్నం చేసిన భార్గవి వెనక-

తనకు తెలియని కత ఒకటి ఉందంటే ఆశ్చర్యంగా వుంది మయూషకు.

అప్పటికే భార్గవి వార్త తెల్సి వరుసగా స్టూడెంట్స్, లెక్చరర్స్ ప్రవాహంలా నర్సింగ్‌హోమ్‌కు రావడం మొదలుపెట్టారు.

భార్గవి రాసిన ఉత్తరం, మయూషచేతిలో రెపరెపలాడుతోంది. డ్యూటీ డాక్టర్ రూమ్‌లోకి నడిచి ఉత్తరాన్ని విప్పి చదవడం ప్రారంభించింది మయూష.

డియర్ మయూషా!

అందరు ఆడపిల్లల్లా నేను పెరగలేదు. తండ్రి పోయిన క్షణం నుంచీ నా తల్లి నన్ను కంటికి రెప్పలా పెంచింది. ఎవరూ లేని ఏకాకి తనంలోంచి పెరిగిన నేను బాగా డబ్బు సంపాదించాలని, నా వాళ్ళను ఆదుకోవాలని, వాళ్ళను నిలబెట్టాలని, వార్ని ఒడ్డున పడెయ్యాలనుకున్నాను.

హాస్టల్లోని నా కొలీగ్ ఇచ్చిన సలహా మేరకు ఒక ప్రయివేట్ కంపెనీలో ఏ రికమండేషన్ లేకుండా నాకు ఉద్యోగం దొరికింది. పెద్ద కంపెనీ. మంచి జీతం.

నాకొచ్చిన జీతంలో కొంతభాగం ఇంటికి పంపిస్తూ కాలాన్ని, అవసరాల్ని ఎలాగో అతి కష్టం మీద నెట్టుకొస్తున్న క్షణంలోనే నా జీవితం ఒక అనుకోని మలుపు తిరిగింది.

ఎప్పుడూ బిజీగా టూర్స్‌లో వుండే ఆ కంపెనీ ప్రొప్రయిటర్ ఆఫీస్‌కు రావడం, నన్ను పిలవడం జరిగింది.

అప్పుడు తెల్సింది ఆయనెవరో, మన రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులున్న పెద్ద ఇండస్ట్రియలిస్ట్ జ్వాలాముఖిరావు.

ఆరోజు... ఆయన రూమ్‌లో, నా తండ్రి వయసున్న ఆయనను చూస్తూ, ఆశ్చర్యంగా నిలబడిపోయాను.

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Oka+Sarikotta+Prema+Katha](http://kinige.com/book/Oka+Sarikotta+Prema+Katha)

* * *